# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరావతి రాజధాని నిర్మాణ పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **దేశవ్యాప్తంగా ఈరోజు నీట్ యూజీ 2025 పరీక్ష జరుగుతుంది.**
3. **ముంబైలో మూడు రోజులుగా జరుగుతున్న వేవ్స్ సదస్సు ఈరోజుతో ముగుస్తుంది.**
4. **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**
5. **తెలంగాణలో సన్నబియ్యం పథకాన్ని అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు..**

==========================

అమరావతి రాజధాని నిర్మాణ పనులను మూడేళ్లలో పూర్తి చేసేలా చర్యలుతీసుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రధానమంత్రి సభ విజయవంతమైన నేపథ్యంలో కూటమి మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో ఆయన నిన్న అమరావతి నుంచి శ్రవణమాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర వృద్ధిరేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందన్న ప్రధానమంత్రి వ్యాఖ్యలు భవిష్యత్తు రాజధానిని ఆవిష్కరించాయని పేర్కొన్నారు. ప్రజలందరి భాగస్వామ్యం, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల కృషితో సభ విజయవంతమైందని ముఖ్యమంత్రి వివరించారు.

--------------------------

అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత గురుకుల పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం లక్ష్మీపురంలో యంగ్ ఇండియా గురుకుల పాఠశాల నిర్మాణానికి నిన్న ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... మొత్తం 21 వేల కోట్ల రూపాయల వ్యయంతో 105 పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయస్థాయిలో పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

దేశవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీ 2025 పరీక్ష ఈరోజు జరుగుతుంది. ఈరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. మధ్యాహ్నం

ఒంటి గంటా 30 నిమిషాలలోపు విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడియారాలు, బూట్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, నిషేధిత పదార్థాలను తీసుకెళ్లకూడదని సూచించారు. ఇందుకోసం దేశంలోనూ, విదేశాల్లోనూ కలిపి మొత్తం 566 పరీక్ష కేంద్రాలను జాతీయ పరీక్షా సంస్థ ఎన్‌టిఏ ఏర్పాటు చేసింది. పూర్తిగా పేపర్ పెన్సిల్ విధానంలో ఈ పరీక్ష జరగనుంది.

---------------------------

భారతదేశం మీడియా, వినోద రంగాలలో స్థిరమైన పురోగతిని సాధించనుందని  కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ముంబైలో జరిగిన వేవ్స్ సదస్సు సందర్భంగా గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ సహా 7 గ్లోబల్ సంస్థలు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ –ఐఐసీటీతో నిన్న పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఐఐటీ, ఐఐఎంల తరహాలోనే ఐఐసీటీ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఐఐసీటీ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ కు జాతీయ కేంద్రంగా మారనుందని కేంద్రమంత్రి వెల్లడిస్తూ....

..వాయిస్ 32 సెకన్లు

---------------------------

భారత్‌లో క్రియేటివ్ ల్యాండ్ ఆసియా సంస్థ మొదటి ఎంటర్‌టైన్‌మెంట్ సిటీని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్–2025లో రాష్ట్ర ప్రభుత్వం క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే పర్యాటకులు కోసం థీమ్ పార్కులు, గేమింగ్ జోన్‌లు, గ్లోబల్ సినిమా కో–ప్రొడక్షన్ జోన్‌లు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. అలాగే ఉద్యోగ సృష్టి, నైపుణ్య అభివృద్ధి, పర్యాటకం, డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ముంబైలో మూడు రోజులుగా జరుగుతున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్.. వేవ్స్ 2025 సదస్సు ఈరోజుతో ముగుస్తుంది. చివరి రోజు అయిన ఈ రోజు క్రియేటోస్పియర్, వేవ్ ఎక్స్ కార్యక్రమాలు కొనసాగుతాయి. అలాగే సాంస్కృతిక, సంగీత ప్రదర్శన విభాగంలో క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ ఫైనలిస్టులు విజేతలు వాహ్ ఉస్తాద్ సంగీత కార్యక్రమంలో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈరోజు కూడా క్రియేటోస్పియర్, వేవ్ ఎక్స్ అంశాలపై మాస్టర్ క్లాసులను నిర్వహిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసమే రాష్ట్ర రాజధాని పునఃనిర్మాణ పనులను చేపట్టామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలోని కాంప్ కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ...

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

కఠోరమైన దీక్షతో ఆకాశం నుంచి భూమికి గంగను రప్పించిన భగీరథ మహర్షి జయంతిని ఈ రోజు

నిర్వహిస్తున్నారు. కపిల మహర్షి శాపం నుండి తన పరివారానికి విముక్తి కల్పించేందుకు భగీరథుడు గంగను నది రూపంలో తీసుకువచ్చాడని పురాణాలు చెపుతున్నాయి. కాగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా ఈ రోజు నిర్వహిస్తుంది.దీనిలో భాగంగా విశాఖపట్నంలోని గాజువాకలో భగీరథ మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పాల్గొననున్నారు. ఈ సందర్భంగా భగీరథుని విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించనున్నారని అధికారులు తెలిపారు

---------------------------

తెలంగాణలో సన్నబియ్యం పథకాన్ని అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని చౌక ధరల దుకాణంలో మంత్రి నిన్న సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

పహల్గామ్ ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్తాన్ పై భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దౌత్య పరంగా ఆ దేశంపై అనేక రకాల ఆంక్షలు విధించిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా పాకిస్తాన్ నుండి ప్రత్యక్ష, పరోక్షంగా ఎగుమతులు, దిగుమతులను కూడా నిషేధించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు నిన్న నోటిఫికేషన్ జారీ చేసింది. పాకిస్తాన్ నుండి భారత దేశానికి ప్రత్యక్ష దిగుమతులు చాలా తక్కువగా ఉన్నాయి. ఇప్పుడు వీటన్నింటిపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటన పేర్కొంది. మరొక వైపు పాకిస్తాన్ నుండి వాయు, ఉపరితల మార్గాల ద్వారా వచ్చే అన్ని రకాల మెయిల్, పార్సిల్‌ల మార్పిడిని కూడా నిలిపివేయాలని నిర్ణయించినట్లు కేంద్ర కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వెల్లడించింది. బలమైన ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి గరిష్టంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం తెలిపింది.

====================